ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
మంగళవారం | 30 ఏప్రిల్, 2024 | పేజీలు : 5



కాంగ్రెస్‌లో చేరిన అమిత్‌రెడ్డి

# మరోసారి బిజెపి అధికారంలోకి వస్తే దేశానికి తీవ్రప్రమాదం

బిజెపిని ఓడిద్దాం.. కాంగ్రెస్‌ను గెలిపిద్దాం..
సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పల్లా వెంకటరెడ్డి



మెయిన్‌లో...



శాంతియుతంగా ఎన్నికలు జరిగేందుకు సహకరించాలి

4లో

# ప్రజాక్షేత్రంలో కమ్యూనిస్టుల పాత్ర కీలకం

మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి



**ప్రజాపక్షం / మిర్యాలగూడ :** ప్రజాక్షేత్రంలో కమ్యూనిస్టుల పాత్ర కీలకమని, వారి పోరాట పటిమ చాలా గట్టిదని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. ఇండియా కూటమిలో భాగంగా బలపరచిన కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్ రెడ్డి గెలుపును కాంక్షిస్తూ సోమవారం ఎస్వీ కన్వెన్షన్‌లో సీపీఎం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి, మిర్యాలగూడ, సాగర్ ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, కుందూరు జైవీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డిలతో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. రఘువీర్‌రెడ్డి గెలుపు చరిత్రలో పదిలంగా ఉండే విధంగా కృషి చేయాలన్నారు. పార్టీలకతీతంగా పనిచేసే ప్రజల మనిషిని ఎవరూ వచ్చినా, పార్టీ వారైనా అడిగిన వెంటనే వారి సమస్యలను పరిష్కరించిన సందర్భాలు అనేకం ఉన్నాయని, ఇక్కడ కూర్చున్న వారందరికి ఆ విషయం తెలుసన్నారు. ప్రధానమంత్రి మోడి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, చట్టాలు, రాజ్యాంగ ఉల్లంఘన ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అన్నారు. హామీలను అమలు చేయలేక అధికారాన్ని కోల్పోయిన బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పేదల సంక్షేమ కోసం అమలు జరుపుతున్న పథకాల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. హరీష్ రావు సంస్కార హీనమైన మాటలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఇటీవల మిర్యాలగూడలో జరిగిన రోడ్‌షోలో మాజీ సీఎం కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై పచ్చి అబద్ధాలు, ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసమని అన్నారు. రఘువీర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించే బాధ్యత ఇండియా కూటమి భుజస్కందాలపై వేసుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు కెతావత్ శంకర్‌నాయక్, సీపీఎం నాయకులు మల్లు నాగార్జునరెడ్డి, మల్లు లక్ష్మి, సుధాకర్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మంచినీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి

జిల్లా అదనపు కలెక్టర్ ప్రియాంక



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్‌రూరల్ :** వేసవికాలంలో మంచినీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రియాంక అధికారులను కోరారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి మిషన్ భగీరథ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొని ఆమె మాట్లాడారు. గ్రామాల్లో మంచినీటి ఎద్దడి ఏర్పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.కృష్ణానదిలో నీటి ప్రవాహం తగ్గుతున్న నేపథ్యంలో సత్వర చర్యలు తీసుకుని మంచినీటి సరఫరా అయ్యేందుకు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.ప్రభుత్వం గ్రామాల్లో, పట్టణాల్లో మంచినీటి ఎద్దడిని తట్టుకునేందుకు నిధులను కూడా సమకూరుస్తుందని ఆమె తెలిపారు.ప్రతి గ్రామంలో ప్రత్యేక అధికారులు,కార్యదర్శులు చర్యలు చేపట్టాలని ఆమె కోరారు.వేసవికాలంలో అధికారులు అప్రమత్తంగా ఉండి సమన్వయంతో పనిచేయాలని సూచించారు.మంచినీటి సరఫరా విషయంలో అధికారులు నిర్లక్ష్యం వీడాలని ఆమె కోరారు. సాధ్యమైనంత వరకు మిషన్‌భగీరథ ద్వారా మంచినీటిని సరఫరా చేయాలన్నారు.అధికారులు ఇతర ఏర్పాట్లు కూడా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సీ వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అరుణ్‌కుమార్‌రెడ్డి, ఏఈ శ్రీనివాస్, జడ్‌పి సీఈవో అప్పారావు, అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

# ఫిర్యాదులపై వెంటనే చట్టపరంగా చర్యలు

జిల్లా ఎస్‌పి రాహుల్‌హెగ్డే



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్ :** శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కారానికి బాధితులకు అండగా ఉంటూ ఫిర్యాదులపై వెంటనే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి 8 ఫిర్యాదులు వచ్చినాయి. వివిధ సమస్యలపై బాధితుల నుండి వచ్చిన అర్జీలను జిల్లా ఎస్పీ స్వీకరించారు. ఎస్పీ ప్రజావాణిలో బాధితుల నుండి వచ్చిన ఫిర్యాదులపై ఆయా పోలీస్‌స్టేషన్‌ల అధికారులతో మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌ల పరిధిలోని ప్రతి అంశాన్ని చట్ట పరిధిలో పరిష్కరించడంలో, న్యాయం చేయడంలో వేగంగా చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. పౌరులు చట్టానికి లోబడి నడుచు కోవాలని,చట్ట ఉల్లంఘన చర్యలకు పాల్పడిన, ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఎన్నికలకోడ్ అమలులో ఉన్నందున ఎవరూ కూడా గొడవలు పెట్టుకోవద్దని, గ్రామాల్లో అసత్యప్రచారం చేయవద్దని, సోషల్ మీడియా నందు అనుచిత వ్యాఖ్యలు చేయవద్దన్నారు. ఎస్పీ వెంట అదనపు ఎస్పీ నాగేశ్వరరావు ఉన్నారు.

## మాజీ మంత్రి పర్యటన అట్టర్‌ప్లాప్

**ప్రజాపక్షం/నడిగూడెం :** మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి మండల పర్యటన అట్టర్‌ప్లాప్ అని, మాట్లాడిన ప్రతిమాట కూడా అబద్దాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బూత్కూరి వెంకటరెడ్డి అన్నారు.సోమవారం మండల కేంద్రంలో జరిగిన కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు.150 రోజుల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో నియోజకవర్గంలోని లిఫ్ట్ ఇరిగేషన్లు, ఆర్అండ్‌బి రోడ్లు, గ్రామాలలో తాగునీటి బోర్లు వేయడం,అభివృద్ధి విషయంలో వందలకోట్ల రూపాయలతో మండలాన్ని అభివృద్ధి ఎమ్మెల్యే పద్మావతిరెత్తి మంత్రి ఉత్తమ్ సహకారంతో కృషి చేస్తున్నారని ఆయన అన్నారు.అభివృద్ధి చేసే వారీ మీద అవాకులు, చవాకులు మాట్లాడుతుంటే ప్రజలు ఊరుకోరని,ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మండలం నుండి కాంగ్రెస్ పార్టీకి 5 వేల మెజార్టీ వచ్చిందన్నారు.రాబోయే ఎంపి ఎన్నికల్లో నల్లగొండ కాంగ్రెస్ ఎంపి అభ్యర్థికి అత్యధిక మెజార్టీ వచ్చేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


## రఘువీర్‌రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపిద్దాం

**ప్రజాపక్షం/నేరేడుచర్ల :** సిపిఐ బలపర్చిన కాంగ్రెస్ పార్టీ నల్లగొండ ఎంపి అభ్యర్థి కందూరు రఘువీర్‌రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపిద్దామని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ధూళిపాళ ధనంజయనాయుడు పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం మండలంలోని బోడలదిన్నె గ్రామంలో జరిగిన సిపిఐ ప్రజాసంఘాల బాధ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్తు బాగుపడాలంటే ,దేశ ప్రయోజనాల కోసం ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. నేరేడుచర్ల,పాలకవీడు, పెన్‌పహాడ్ మండలాల్లోని సిపిఐ పార్టీ సభ్యులు అనుబంధ ప్రజాసంఘాల బాధ్యులు కాంగ్రెస్ పార్టీ విజయానికి చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి యల్లబోయిన సింహాద్రి, సిపిఐ పట్టణ కార్యదర్శి కత్తి శ్రీనివాసరెడ్డి, వ్యకాస జిల్లా ఉపాధ్యక్షుడు రావుల సత్యం, మహిలా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ.లక్ష్మీ ,ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను పాల్గొన్నారు.

## లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆహారవృథానివారణ దినోత్సవం

**ప్రజాపక్షం/నేరేడుచర్ల :** లయన్స్‌క్లబ్ నేరేడుచర్ల వారి ఆధ్వర్యంలో ప్రపంచ ఆహార వృధా నివారణ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు మాట్లాడుతూ పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు మీ కుటుంబంలో నిర్వహించే శుభకార్యాలను ఫంక్షన్‌హాల్, ఇంటి వద్ద వివిధ శుభకార్యాలను జరుపుకుంటున్న సందర్భంగా మిగిలిపోయిన ఆహార పదార్థాలను వృథా చేయకుండా లయన్స్‌క్లబ్ వారికి ఆహార పదార్థాల సమాచారాన్ని తెలియపరచినట్లయితే క్లబ్ వారు అట్టి ఆహార పదార్థాలను తమ సొంత ఖర్చులతో రవాణి చేసి అవసరమైన వారికి అందచేస్తామని తెలియజేశారు.క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి, డిస్ట్రిక్ చైర్మన్ బట్టు మధు ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యమ్రంలో రాచకొండ శ్రీనివాసరావు, గుండా సత్యనారాయణ, యూసూఫ్, వెంకట్‌రెడ్డి, కోటేశ్వరరావు, చిలకరాజు శ్రీను,ప్రభాకర్,నటరాజ్, కొత్త లక్ష్మ ణ్ పాల్గొన్నారు.

## వాహనాల తనిఖీలో నార్కోటిక్ డాగ్ రోలెక్స్



**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో భాగంగా డబ్బు, మద్యం, విలువైన వస్తువులు, డ్రగ్స్ వంటి అక్రమ రవాణా జరగకుండా నిలువరించేందుకు జిల్లా పోలీసులు మండల పరిధిలోని సమీపంలో 65వ జాతీయ రహదారిపై అంతర్ జిల్లా సరిహద్దు వద్ద జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే ఆదేశాలతో నార్కోటిక్ డాగ్ రోలెక్స్‌తో వాహనాలను తనిఖీ చేశారు. రోలెక్స్ డాగ్ డ్రగ్స్‌ను గుర్తించడంలో నైపుణ్యం కలిగి ఉంటాయి. గతంలో ఇండియా పోలీస్ డ్యూటి మీట్ లో ప్రతిభ చూపిన నార్కోట్టిక్ విభాగంలో డాగ్ రోలెక్స్ బహుమతి పొందింది.

## కులగణనను వ్యతిరేకిస్తున్న బిజెపిని తిరస్కరిద్దాం




**ప్రజాపక్షం/భువనగిరిరూరల్ :** రాజ్యాంగాన్ని మార్చాలని, చతుర్ వర్ణ వ్యవస్థ పాలనను తీసుకరావాలని చూస్తున్న బిజెపిని మోడీ విధానాలను తిరస్కరిద్దామని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సోమవారం స్థానిక సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ, మోడీ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నికరంగా పోరాడేది కమ్యూనిస్టు పార్టీ లేనని తెలిపారు. భువనగిరిలో సిపిఎం సుత్తే కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేసి అభ్యర్థి ఎండి జహంగీర్ గెలిపించాలని కోరారు. ఈ దేశంలో మోడీ తప్పుడు విధానాలతో పరిపాలన సాగిస్తున్నారని తెలిపారు. 400 సీట్లు అంటూ మైండ్ గేమ్ ఆడిన ఈ దేశంలో మోడీ కాలం చెల్లని పరిస్థితులు దాపురించాయన్నారు. దేశానికి ప్రమాదకరమైన విధానాలు అవలంబిస్తున్న మోడీ రాజ్యాంగాన్ని, కుట్రలు చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం రాజ్యాంగాన్ని కాపాడే కర్తవ్యం దేశ ప్రజల ముందు ఉందన్నారు. భువనగిరి పార్లమెంటు పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గలలో కమ్యూనిస్టులు పలుమార్లు గెలిచి ఈ ప్రాంత అభివృద్ధికి, ప్రజలకు సేవలు చేశారన్నారు. మొదటి పార్లమెంట్ ఎన్నికలలో దేశ ప్రధాని జవహర్లాల్ నెహ్రూ కంటే స్థానికంగా కమ్యూనిస్టు పార్టీపై నిలబడ్డ రావి నారాయణరెడ్డి కి అత్యధిక ఓట్లు సాధించారని తెలిపారు.

## మేడేను జయప్రదం చేయండి : ఎఐటియుసి




**ప్రజపక్షం/చింతపల్లి :** ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు కార్మికులకు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని కుర్మేడు గ్రామంలో సోమవారం ఏఐటియుసి ఆధ్వర్యంలో మేడే గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సంఘటిత, అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మిక సమస్యలు పరిష్కరించాలని సంవత్సరాల తరబడి పోరాటాల నిర్వహిస్తున్న వారి సమస్యలు ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం విచారకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో త్యాగాలు, బలిదానాలతో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను తెచ్చి కేంద్ర ప్రభుత్వం కార్మికుల పొట్ట కొడుతుందన్నారు. ప్రభుత్వాలు కార్మికుల పని గంటల సమయాన్ని పెంచి, కార్మికుల శ్రమను దోపిడి చేయాలని కుట్ర పన్నుతున్నాయని అన్నారు.

## ప్రత్యామ్నాయ రాజకీయాల కోసమే టిజెఎస్ ఆవిర్భావం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** త్యాగాలు, బలిదానాలతో కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ప్రత్యామ్నాయ రాజకీయాల కోసం తెలంగాణ జన సమితి ఆవిర్భవించిందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు పన్నాల గోపాల్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా జెండా ఆవిష్కరించి అనంతరం ఆయన మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాల నుండి ప్రజల పక్షాన నిలబడి ప్రజల సమస్యల పరిష్కారం కోసం అనేక రూపాలలో ఉద్యమం చేయడం జరిగిందన్నారు. తెలంగాణ వస్తే నిరుద్యోగులకు ఉద్యోగాలు లభిస్తాయని ఆశించిన నిరుద్యోగులకు నిరాశే మిగిలిందన్నారు. ఒక వైపు ఉద్యోగాలు రాక నిరుద్యోగులు, పండించిన పంటలకు గిట్టుబాటు ధర రాక రైతులు అదే విధంగా అన్ని వర్గాల ప్రజలపై గత ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహారించిందని ఆరోపించారు.కెసిఆర్ ప్రభుత్వ నిరంకుశ విధానాలకు అవినీతికి వ్యతిరేకంగా ఉద్యమించి శాసన సభ ఎన్నికలలో బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఓడించడంలో టిజెఎస్ కీలక పాత్ర పోషించిందన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో కూడా మతతత్వ బిజెపిని ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెబోయిన నాగేశ్వరరావు యాదవ్, జిల్లా కార్యదర్శి క్రాంతి కుమార్, జిల్లా నాయకులు కట్ల జగనాదం, కర్నే కంటి కిరణ్, విద్యార్థి జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధీరావత్ వీర నాయక్, పగిలి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## సోలార్ పవర్‌ప్లాంట్ స్థలం పరిశీలన



**ప్రజాపక్షం/అనంతగిరి :** మండలంలోని శాంతినగర్ గ్రామం నుండి వెళ్తున్న జాతీయ రహదారి పక్కన ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేయనున్న సోలార్ పవర్ ప్లాంట్ స్థలాన్ని సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ ప్రియాంక పరిశీఇంచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిపాదనల నివేదికలు ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు తెలిపారు.ప్రభుత్వ అనుమతులతో సోలార్ ప్లాంట్ నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్నటువంటి సోలార్ ప్లాంట్‌ను అధికారులకు గ్రామస్తులు సహకారం అందించాలని కోరార. కేంద్ర ప్రభుత్వ అధికారులు ఆమోదించి శాంతినగర్‌లో ఏర్పాటు చేస్తే మండల ప్రజలు ఉపాధి కల్పించినట్లు అవుతుందని గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో ఆర్డీవో సూర్యనారాయణ, తహసీల్దార్ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనది



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని జిల్లా వైద్యా, ఆరోగ్యశాఖ అధికారి ఏ కొండలరావు అన్నారు. సోమవారం స్థానిక అశోక గార్డెన్లో కొండమల్లేపల్లి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ అన్నమ్మ పదవి విరమణ సన్మానోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అన్ని వృత్తుల కన్నా వైద్యవృత్తి ఎంతో కీలకమని, రోగికిఇబ్బందిగా ఉన్నప్పుడు సేవ చేసిన వైద్య సిబ్బంది జీవితాంతం గుర్తుంటారని, అన్నమ్మ ఏఎన్ఎం నుంచి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ గా,కరోనాలో అన్నమ్మచేసిన సేవలు ఎనలేని ప్రాణాలకు తెగించి వారు ఎంతమంది కో ప్రాణం పోసారని కొనియాడారు. ఈ సందర్భంగా అన్నమ్మ, లుర్దురాజు దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డి ఎం హెచ్ ఓ వేణుగోపాల్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ అరుంధతి, డాక్టర్ కళ్యాణ చక్రవర్తి, డి ఐ ఓ పద్మ, డాక్టర్ రూపిక, వైద్యశాఖ ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొందుగుల వెంకటేశ్వర్ రెడ్డి, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ మోగిరాల శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు భిక్షం, కార్యదర్శి నరసింహ చారి, కోశాధికారి మధు, అంజయ్య గౌడ్, మనోజ్ రెడ్డి, జమాలుద్దీన్ ,మేరీ ,వాల్తేరిసా తదితరులు పాల్గొన్నారు.

## ఎబివిపి గుండాల దాడిని ఖండించాలి




**ప్రజాపక్షం/సూర్యాపేట :** కవులు, రచయితలపై మతోన్మాద ఎబివిపి గుండాలు దాడి చేయడం అప్రజాస్వామికమని, ఈ దాటిని ప్రతీ ఒక్కరు ఖండించాలని పిఒడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పిడిఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్‌లు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని విక్రమ్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ వరంగల్ కాకతీయ యూనివర్సిటిలో సెక్యులర్ రైటర్స్ ఫోరం ఆధ్వర్యంలో జరిగిన లౌకిక శక్తుల, రచయితల సమావేశంపై ఎబివిపికి చెందిన అరాచకవాదులు సదస్సులో జొరబడి వైదికపై ఉన్న నాయకులను దుర్భాషలాడడం, ఫ్లెక్సీలు, బ్యానర్లను చించి దాడులకు పాల్పడడం సరైంది కాదన్నారు. అనేక భావాజాలలను సైతం చర్చించే ప్రజాస్వామిక వాదులపై దాడులకు పూనుకోవడం ఎంతవరకు సమంజసమన్నారు. ఇలాంటి చర్యలపై పోలీసు యంత్రాంగం, ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బిజెపిని ఓడించి గుణపాఠం చెప్పాలన్నారు. ఐఎఫ్టియు నాయకులు పిడమర్తి లింగయ్య, పిఒడబ్ల్యు జిల్లా ఉపాధ్యక్షులు సూరం రేణుక, పద్మ, పిడిఎస్‌యు నాయకులు విజయ్ రెడ్డి, వేణు తదితరులు పాల్గొన్నారు.

## ఎటిఎంలో చోరీకి యత్నం

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** చౌటుప్పల్ పట్టణంలోని ఇండియన్ బ్యాంక్ పక్కన ఉన్న ఏటీఎంలో ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి యత్నించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని జాతీయ రహదారి పక్కన మార్కెట్ యార్డ్ ఎదురుగా ఉన్న ఇండియన్ బ్యాంక్ పక్కన ఏర్పాటు చేసిన ఏటీఎంలోకి ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తి చొరపడ్డారు. ఏటీఎం మెషిన్‌లో డబ్బును దొంగిలించే ప్రయత్నం చేస్తుండగా సైరన్ మోగింది. దీంతో దుండగుడు అక్కడి నుంచి పరారయ్యాడు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. సీసీ కెమెరా ఫుటేజ్ ఆధారంగా దొంగలను గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్ రెడ్డి తెలిపారు.

## కృష్ణారెడ్డిని పార్లమెంట్‌కు పంపండి

**ప్రజాపక్షం/డిండి :** మాజీ సీఎం కేసీఆర్ పాలనలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండే అని ప్రభుత్వం మారి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అన్ని కష్టాలే ప్రజలకు మిగిలాయని నల్గొండ బిఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి ప్రజలకు తెలిపారు. సభలో ఆయన మాట్లాడుతూ రైల్వేలైన్ కోసం, గిరిజన యూనివర్సిటి, వ్యవసాయానికి ఉపాధి హామీ అనుసంధానం కోసం, రైతులకు గిట్టుబాటు ధర కోసం పాటుపడుతూ ఉద్యమిస్తానని అన్నారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మి మోసపోయారని మళ్ళి మోసపోకుండా ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటేసి గెలిపించా

# కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రిజర్వేషన్ల పెంపు

ప్రజాపక్షం / మిర్యాలగూడ : కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే రిజర్వేషన్ల పెంపు సాధ్య పడుతుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్నా కైలాష్ అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అయితే దేశ వ్యాప్తంగా కులగణన చేసి రిజర్వేషన్లు పెంచుతారన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు తొలగిస్తారని అన్నారు. రిజర్వేషన్ల తోపాటు రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలంటే మోడిని గద్దెదింపాలన్నారు కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని భారీ మెజారిటీతో విజయం సాధించడం ఖాయమన్నారు. నల్లగొండ జిల్లాలో బీఆర్ఎస్ ఉనికి కోల్పోయిందని, బీజేపీకి డిపాజిట్లు కూడా దక్కవని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తన కూతురు కవిత కోసం ఆరు స్థానాలకు డమ్మీ అభ్యర్థులను నిలిపారని, తెరచాటుగా వారి గెలుపుకు కృషి చేస్తున్నారని అన్నారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తలకొప్పుల సైదులు, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింగ్ వెంకటేశ్వర్లు, ఓబీసీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్, పార్లమెంట్ ఇన్‌చార్జి మెరుగు శ్రీనివాస్, నాయకులు ఆవుల బక్కారెడ్డి, ఇమ్రాన్, చాంద్‌పాషా, పోలగాని వెంకటేష్‌గౌడ్, వెంకటేశ్వర్లు, పుల్ల య్య తదితరులు పాల్గొన్నారు.



# రఘువీర్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేస్తా

ప్రజాపక్షం / మిర్యాలగూడ : అప్పుడున్న పరిస్థితుల దృష్ట్యా బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లాల్సి వచ్చిందని, మాజీ సీఎల్పీ నేత జానారెడ్డితో తమ కుటుంబానికి ఉన్న అనుబంధంతో ప్రస్తుతం కాంగ్రెస్‌లోకి రావడం జరిగిందని, నల్లగొండ పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కుందూరు జానారెడ్డి తనయుడు రఘువీర్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా తాము పనిచేస్తామని మిర్యాలగూడ మున్సిపల్ ఛైర్మన్ తిరునగరు భార్గవ్ అన్నారు. సోమవారం పట్టణంలోని వాసవీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనకు 25 ఏండ్ల వయస్సు నుంచే జానారెడ్డితో కార్యకర్తగా పనిచేశానని, ఆయన కుమారుడు మొదటిసారిగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నాడని తెలిసి బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లోకి వచ్చామన్నారు. స్థానిక నాయకత్వం కొంతమేరా వ్యతిరేకత ఉన్నమాట వాస్తవమైనప్పటికీ అందరిని కలుపుకొని వెళ్తామన్నారు. 13 మంది కౌన్సిలర్లతోపాటు సింగిల్ విండో ఛైర్మన్, ఇతర 15 మంది వార్డు ఇన్‌చార్జిలతో కలిసి బీఆర్ఎస్‌కు రాజీనామా చేసామని, అంతేకాని పదవులు ఆశించి పార్టీ మారలేదన్నారు. కేవలం తమ కుటుంబానికి రాజీయక అక్షరాలను నేర్పిన జానారెడ్డి కుమారుడి కోసమే పార్టీ మారాల్సి వచ్చిందన్నారు. అధిష్టానం ఎటువంటి నిర్ణయం తీసుకున్నా గౌరవిస్తామని,దాంతోపాటు తామందరం ఎక్కడ ఉన్నా ఏ పరిస్థితులో ఉన్న రఘువీర్‌రెడ్డి గెలుపుకై పనిచేస్తామన్నారు. స్థానిక ఎమ్మెల్యేతోపాటు పార్టీ నాయకత్వం పిలిస్తే ప్రచారంకు వెళ్తానని, లేనియెడల తమ అనుచరులతో కలిసి తమవంతు ప్రయత్నం చేస్తామని తెలిపారు. కలిసి పనిచేయడానికి తమకు ఎలాంటి అభిప్రాయ భేదాలు లేవని, ఎవరి పక్షమైనా అంతిమంగా రఘువీర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించడమేనన్నా. సమావేశంలో 13 మంది కౌన్సిలర్లు తిరునగరు నాగలక్ష్మి , ఉదయ్‌భాస్కర్, బంటు రమేష్, అమృతం దుర్గాసత్యం, గోవిందరెడ్డి, పత్తిపాటి సంజాతనవాబ్, సాధికాబేగం, ఉబ్బపల్లి వెంకమ్మసోములు, సత్యవేణిశ్రీనివాస్, మలగం రమేష్, సలీం, మెరుగు రోశయ్య, డీసీసీబీ డైరెక్టర బంటు శ్రీనివాస్‌తోపాటు కార్యకర్తలు ఉన్నారు.



## వాడవాడలా మేడే నిర్వహించాలి



ప్రజాపక్షం / మిర్యాలగూడ : ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే సందర్భంగా అన్ని కార్మిక సంఘాల నాయకులు వాడవాడలా ఎర్రజెండాను ఆవిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి.సయ్యద్‌లు పిలుపునిచ్చారు. స్థానిక ఎన్‌టీఆర్ కాంప్లెక్స్ కారు జీపు అడ్డ వద్ద సోమవారం మేడే గోడ పత్రికను ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు ఎన్నో పోరాటాల ఫలితంగా కార్మికులు సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం హరించి వేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వరంగ సంస్థలను ఒక్కొక్కటిగా కార్పోరేట్ శక్తులకు దారాదత్తం చేస్తుందని విమర్శించారు. మేడే స్ఫూర్తితో కార్మికవర్గాలు ఏకమై పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. మోడి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు 44 కార్మిక చట్టాలు రద్దు చేశారని, వాటిని వెంటనే అమలు చేయాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాడ్యుటీ బోనస్, పెన్షన్ చట్టాలు అమలుపరచాలన్నారు. మృతిచెందిన భవన కార్మికులకు రూ.10లక్షలు చెల్లించాలని, అదేవిధంగా రూ.5వేల పెన్షన్ వర్తింప చేయాలన్నారు. పెరిగిన నిత్యావసర ధరలను వెంటనే తగ్గించాలన్నారు. కార్మికులు ఐక్యంగా ఉన్నప్పుడే హక్కులను సాధించబడుతాయన్నారు. కార్యక్రమంలో గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి ధీరావత్ లింగానాయక్, వేములపల్లి సీపీఐ మండల కన్వీనర్ జిల్లా యాదగిరి, దళిత హక్కుల పోరాట సమితి నియోజకవర్గ కన్వీనర్ వలపట్ల వెంకన్న, కార్మికులు హఫీజ్, రసూల్, బాషా, జానయ్య, చోటు, నజీర్, సలీం, జాని, అలీ పాల్గొన్నారు.

## మేడేను పోరాట దీక్ష దినంగా పాటిద్దాం



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాల సవరణ పేరుతో బహుళ జాతి పెట్టుబడిదారులకు అనుకూలంగా 44 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లుగా సవరణ చేసి కార్మికులు సాధించుకున్న హక్కులను కాలరాస్తున్న మోదీకి వ్యతిరేకంగా మే 1న ప్రపంచ వ్యాప్తంగా జరిగే మేడేను పోరాట దీక్ష దినంగా పాటించాలని భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ (బిఆర్‌టియు) జిల్లా అధ్యక్షులు గుర్రం వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బూటకపు వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలు అవలంభిస్తుందని ఆరోపించారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని చేయకుండా వారికి జీతాలు సకాలంలో చెల్లించకుండా ప్రభుత్వం వారి జీవితాలతో చెలగాటమాడుతుందని మేడే సందర్భంగా కార్మికుల హక్కుల కోసం మరో పోరాటానికి సిద్ధం కావాలని కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. మేడే రోజున జిల్లా వ్యాప్తంగా అన్ని కార్మికుల అడ్డాలలో బిఆర్‌టియు జెండాను ఎగురవేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు సిల్వేరు ప్రభాకర్, ఆర్.ఆచారి, మిషన్ భగీరథ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బత్తుల వెంకటేశం, యన్నమల్ల వెంకన్న ఉన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన యువకులు

ప్రజాపక్షం/కొండమల్లేపల్లి : మండల పరిధిలోని చింతకుంట్ల గ్రామానికి చెందిన పలువురు యువకులు సోమవారం టీపీసిసి సభ్యులు, పిఏసిఎస్ ఛైర్మన్ డా. వేణుధర్‌రెడ్డి సమక్షంలో బిజెపి, బిఆర్ఎస్, బిఎస్పి పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి డా. వేణుధర్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాధరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్గొండ పార్లమెంట్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని దేశంలోనే అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని పార్టీలో చేరిన వారికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కంభంపాటి వెంకటమ్మ, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ సెక్రటరీ ఏకుల అంబేద్కర్, చింతకుంట్ల మాజీ సర్పంచ్ పందిరుద్రమ్మ శ్రీనయ్య, శవ్వ మదార్, శివ, ఏకుల వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## చిత్రలేఖనంలో విద్యార్థులకు శిక్షణ

ప్రజాపక్షం/చిట్యాల : నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామంలోని గ్రంథాలయంలో విద్యార్థులకు పలు అంశాలపై వేసవి శిక్షణా శిబిరం నిర్వహించబడుతుంది. అందులో భాగంగా సోమవారం రోజున శిబిరంలో పాల్గొంటున్న చిన్నారులకు ప్రముఖ చిత్రకారుడు కూరెళ్ళ శ్రీనివాస్ చిత్రలేఖనంలోని మెళకువల పట్ల శిక్షణ ఇవ్వడం జరిగింది. విద్యార్థులు చిత్రలేఖనం నేర్చుకోవడం పట్ల ఆసక్తి కనబరిచారు. వారిలో ఆసక్తిని మరింత పెంచడానికి శ్రీనివాస్ చిత్రలేఖనమునకు సంబంధించిన వస్తు సామాగ్రిని అందజేశారు. ఈనెల 10 వతేది వరకు గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి శిక్షణా శిబిరం నిర్వహించబడుతుందని గ్రంథాలయ అధ్యక్షులు అనుముల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌కు గ్రంథాలయ కమిటి సభ్యులు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో కథ రచయిత కె రవి, కమిటి సభ్యులు ఎల్లంకి లక్ష్మణాచారి, గరిశె అంజయ్య, గ్రామ ప్రముఖులు గోపగోని శ్రీనివాస్, గరిశె చిట్టిబాబు, శేషగిరి, బూరుగు గోపికృష్ణ, బొడిగె కీర్తి తదితరులు పాల్గొన్నారు.

## భీష్మాచారికి గౌరవ డాక్టరేట్



ప్రజాపక్షం/చిట్యాల : నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామానికి చెందిన కవి, రచయిత అక్కినేపల్లి భీష్మాచారికి గౌరవ డాక్టరేట్ బిరుదును ప్రధానం చేశారు. తెలుగు సంస్కృతీ సాహితీ సేవా ట్రస్ట్, సాహితీ బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు హైదరాబాద్‌లోని త్యాగరాయ గాన సభలో జాతీయ ఉగాది పురస్కారాలలో భాగంగా ఈనెల 28న ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ అవార్డును అందుకున్నారు. ప్రజా సమస్యలు, ప్రకృతి, కరోనా లాంటి అంశాలపై ప్రజలలో చైతన్యం తేవడం కోసం ఆయన పలు రచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు మాచవరం గౌరీశంకర్, ప్రముఖులు బ్రహ్మశ్రీ దైవజ్ఞ శర్మ, జబర్దస్ అప్పారావు, రామలింగాచారి, ఆనంద్ వేలు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడే పార్టీ టిజెఎస్



ప్రజాపక్షం/సూర్యాపేట : తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడే ఏకైక పార్టీ తెలంగాణ జన సమితి అని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు గట్ల రమాశంకర్ అన్నారు. సోమవారం తెలంగాణ జన సమితి పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరించి మాట్లాడారు. పార్టీ ఆవిర్భావం నుండి నేటి వరకు ప్రజా, విద్యార్థి, యువత సమస్యలపై పార్టీ రాజీలేని ఎన్నో పోరాటాలను నిర్వహించిందని గుర్తు చేశారు. డబ్బులే కేంద్రంగా పని చేస్తున్న నేటి రాజకీయాల్లో తెలంగాణ జన సమితి పార్టీ మాత్రం ప్రజలతో మమేకమై ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి, నిరుద్యోగులు, విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తమ పార్టీ ఏజెండాగా పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ యువజన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు కిరణ్, లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ కుంచం చంద్రకాంత్, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ బచ్చలకూరి గోపి, జిల్లా నాయకులు కొల్లు కృష్ణారెడ్డి, వలికి గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక వర్గాన్ని మతపరంగా విభజిస్తున్న బిజెపి

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : కేంద్రంలోని మోడి ప్రభుత్వం కార్మిక వర్గాన్ని మతపరంగా విభజించే విద్వేష విధానాన్ని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కామల్ల నవీన్, గంటా నాగయ్యలు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో 138వ మేడే ఉత్సవాల గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదేళ్ళ కాలంలో మోడి ప్రభుత్వం సామాన్య ప్రజలను పట్టించుకోకుండా దేశ ప్రజల సంపద, వనరులను కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేసిందన్నారు. జాతీయవాదం పేరుతో బిజెపి దేశంలో 45 కోట్ల మంది సంఘటిత, అసంఘటిత కార్మికుల జీవితాలను సంక్షోభంలో నెట్టిందన్నారు. బిజెపి అధికారంలో వచ్చి నాటి నుండి రక్షణ రంగం, రవాణ, విద్యుత్, విమానయానం, బొగ్గు రంగం, న్యూక్లియర్, ఎరోస్పేస్, రైల్వే, ఇన్సూరెన్స్, బిఎస్ఎన్ఎల్, గ్యాస్, ఆయిల్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను, వాటి అపార సంపదను ప్రైవేటుపరం చేసిందన్నారు. 2024 ఎన్నికల్లో బిజెపి కేంద్రంలో అధికారంలో వస్తే ప్రజలకు స్వేచ్ఛ లేకుండా పోతుందన్నారు. బిజెపి కుట్రలను ప్రజలకు తిప్పికొట్టే విధంగా పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు కామల్ల శ్రీను, జిల్లా సహాయ కార్యదర్శి వి నరసింహారావు, జిల్లా కమిటీ సభ్యులు సామా నర్సిరెడ్డి, వీరయ్య, ఎర్ర ఉమేష్, నగేష్, బొల్లె వెంకన్న, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎండి జాహంగీర్‌ను గెలిపించాలి

ప్రజాపక్షం/మర్రిగూడ : మర్రిగూడ మండలం శివన్నగూడ గ్రామంలో భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ సిపిఎం అభ్యర్థి ప్రజా ఉద్యమ నాయకుడు ఎండి జాంగిర్‌ను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మర్రిగూడ మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య మాట్లాడుతూ భారతదేశంలో ప్రశ్నించే వారు లేకుంటే సమాజం అధోగతి పాలవుతుందని తప్పుడు ఆలోచనలే రాజేమేలుతున్నాయని ఆయన అన్నారు. నిస్వార్థ రాజకీయ ప్రస్థానాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు ప్రజల ఆశీస్సులు కోరుతున్నామని, అన్ని వర్గాల ప్రజలు ఆలోచించి భువనగిరి పార్లమెంట్ సిపిఎం అభ్యర్థి ఎండి జాంగిర్ కు మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మైల సత్తయ్య, సొప్పరి హనుమంతు చాపల సాలయ్య, భారతమ్మ పాల్గొన్నారు.

## దళితుల హక్కుల పరిరక్షణే లక్ష్యం

ప్రజాపక్షం / మిర్యాలగూడ : దళితుల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా ఉద్యమాలు సాగిస్తామని దళిత హక్కుల పోరాట సమితి మిర్యాలగూడ నియోజకవర్గ కన్వీనర్ వలపట్ల వెంకన్న, కో కన్వీనర్ జిల్లా సుధీర్ అన్నారు. ఇటీవల జరిగిన సమావేశంలో ఎన్నికైన సందర్భంగా వారు సోమవారం స్థానికంగా మాట్లాడారు. బడుగు, బలహీనవర్గాల సమగ్ర అభివృద్ధికి పాలక ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్ర చేస్తుందన్నారు. హక్కుల సాధన కోసం దళితులు ఐక్య ఉద్యమాలు జరపాలని పిలుపునిచ్చారు. తమ నియామకానికి సహకరించిన నాయకులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

## పట్టుబడ్డ రూ. 1,20,000 సీజ్



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి :** సార్వత్రిక ఎన్నికలలో భాగంగా పోలీసులు స్టేషన్ వద్ద చేస్తున్న తనిఖీలలో సోమవారం ఒక వ్యాపారి వద్ద ఎలాంటి ఆధారాలు లేకుండా ఉన్నటువంటి రూ. 1,20,000లను సీజ్ చేసినట్లు ఎస్ఐ ముత్యాల రామ్మూర్తి తెలిపారు. ఎలాంటి ఆధారాలు లేకుండా నగదును తరలించిన, ఎన్నికల నిబంధనలకు విరుద్దంగా ఎవరైన వ్యవహరించిన అట్టి వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రామ్మూర్తి అన్నారు.

## సిఎం సహాయనిధి పేదలకు వరం

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** సీఎం సహాయ నిధి పేదల పాలిట వరంగా మారిందని చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు అన్నారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తాళ్ల సింగారం గ్రామానికి చెందిన మందారి నాగేష్‌కు మంజూరైన సీఎం సహాయనిధి రూ.60 వేల చెక్కును సోమవారం మున్సిపల్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని అన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు కోసం సిఫార్సు చేసిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనారెడ్డి, మున్సిపాలిటీ అధ్యక్షులు సుర్వి నరసింహ, మాజీ ఎంపీటీసీ కాసర్ల శ్రీనివాస్ రెడ్డి, రామాలయం అధ్యక్షులు బొబ్బిళ్ళ మురళి, నాయకులు దొనకొండ కృష్ణ, ఆవుల యేసు, ఉదరి యాదయ్య, ఎండి ఎజాస్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## మేడేను విజయవంతం చేయండి




**ప్రజాపక్షం/వలిగొండ :** వలిగొండ మండల కేంద్రంలో మేడే ఉత్సవాల ఏఐటియుసి గోడ పత్రికను ఆవిష్కరించారు. అంతర్జాతీయ మేడే దినోత్సవం ఘనంగా నిర్వహించాలని సిపిఐ మండల పార్టీ కార్యదర్శి పోలేపాక యాదయ్య అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో పౌర ప్రజాస్వామ్య పాలన అంతమవుతుందని, ఈ పది సంవత్సర కాలంలో కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం వచ్చినాక పెట్టుబడిదారీ విధానం కొనసాగుతున్నది దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాల్లో 29 చట్టాలను సమూలంగా రద్దు చేసి పెట్టుబడుదారులకు అనుకూలంగా 4 కోడ్‌లు తెచ్చింది. ఇలాంటి చర్యలు రాజ్యాంగ విరుద్ధం అని అన్నారు. ఇలాంటి ప్రభుత్వాలను ఈ ఎన్నికలలో గద్దెదించాల్సిన అవసరం కార్మిక వర్గంపై ఉన్నదని అన్నారు. అందుకొరకు కార్మిక వర్గాన్ని ఐక్యం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎల్లంకి మహేష్, సిపిఐ పట్టణ కార్యదర్శి మచ్చ లక్ష్మీనారాయణ, బొడిగే సుదర్శన్, చొప్పరి వెంకటేష్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి సుద్దాల సాయికుమార్, మేడి దేవేందర్, ఎస్ రజిత, సూరిబాబు, మురళి తదితరులు పాల్గొన్నారు.

## శాంతియుతంగా ఎన్నికలు జరిగేందుకు సహకరించాలి



**ప్రజాపక్షం/నల్లగొండ :** నల్లగొండ పార్లమెంటు ఎన్నికలను శాంతియుతంగా, నిష్పక్షపాతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు ఎక్కువ మంది ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేసేలా ఎన్నికలలో పోటీలో ఉన్న అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సంపూర్ణ సహకారం అందించాలని జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు మనోజ్ కుమార్ మాణిక్ రావు సూర్యవంశి కోరారు. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థులతో ఆయన జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారి చాంబర్లో సమావేశమయ్యారు. జిల్లా కలెక్టర్,పార్లమెంటు నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందనా మాట్లాడుతూ లోక సభ ఎన్నికలలో భాగంగా పార్లమెంట్ స్థానానికి మొత్తం 31 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా, సోమవారం 9 మంది అభ్యర్థులు వారి నామినేషన్లను ఉపసంహరించుకున్నారని, 22 మంది పోటీలో ఉండగా, వారికి గుర్తులు సైతం కేటాయించినట్లు తెలిపారు. అభ్యర్థులు నామినేషన్ వేసిన రోజు నుండి వారి ఎన్నికల ఖర్చులను నమోదు చేయడం జరుగుతుందని ,అభ్యర్థులు పూర్తిగా ఖర్చులకు సంబంధించిన అంశాలను అవగాహన కలిగి ఉండాలని కోరారు. అదేవిధంగా అభ్యర్థుల ఎన్నికల ఏజెంట్లను సైతం నియమించడం జరుగుతుందని వారందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వనున్నట్లు తెలిపారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ ,స్పెషల్ కలెక్టర్ నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మాడుగులపల్లిలో రఘువీర్‌రెడ్డి ప్రచారం



**ప్రజాపక్షం/ మాడుగులపల్లి :** నల్లగొండ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మిర్యాలగూడ నియోజకవర్గం మాడుగులపల్లి మండలంలో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రోడు షో లో పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కుందూరు రఘువీర్ రెడ్డి, నాగార్జున సాగర్ శాసనసభ్యులు కుందూరు జైవీర్ రెడ్డిలు మాట్లాడుతూ నల్లగొండ జిల్లా అంటేనే కాంగ్రెస్ పార్టీ కిల్లా అనే పేరుని మరోసారి మీరు ఇచ్చే అత్యధిక మెజారిటీతో రుజువు చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్క కాంగ్రెస్ పార్టీ కార్యకర్త మీద ఉందన్నారు. ఎంతటి ఎండలో కూడా వేలాదిగా కదలి వచ్చి మాకు ఘన స్వాగతం పలికినందుకు ప్రతి ఒక్క కాంగ్రెస్ పార్టీ కార్యకర్తకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాలలో వచ్చిన మెజారిటీ కంటే ఎక్కువ మెజారిటీ వచ్చేలా, అత్యధిక ఓటింగ్ పోల్ అయ్యేలా అందరూ కలసి కట్టుగా పనిచేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## జహంగీర్‌నే గెలిపించండి

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** భువనగిరి ఎంపీగా నిరంతరం ప్రజల కోసం పనిచేసే సిపిఎం అభ్యర్థి ఎండి. జహంగీర్‌నే గెలిపించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ళ ఆశయ్య కోరారు. చౌటుప్పల్ మండలం నేలపట్ల, కుంట్లగూడెం గ్రామాల్లో సోమవారం ఇంటింటికి ప్రచారం చేపట్టారు. ఉపాధి హామీ కూలీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో సాగునీటి ప్రాజెక్టులపై అనునిత్యం పోరాటాలు చేస్తూ సిపిఎం ప్రజల పక్షాన నిలబడుతుందని అన్నారు. కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేసే బిజెపి పార్టీ అభ్యర్థులను చిత్తుచిత్తుగా ఓడించాలని కోరారు. బిజెపి పదేండ్ల పాలనలో దేశంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలన్నీ కార్పొరేట్ శక్తుల మయమయ్యాయని తెలిపారు. దేశంలో రైతుల నడ్డి విరిచేలా రైతు వ్యతిరేక చట్టాలు తీసుకువచ్చిందని చెప్పారు. యూపీఏ ప్రభుత్వంలో సిపిఎం క్రియాశీలకంగా ఉండి ఉపాధి హామీ పథకాన్ని తీసుకువస్తే మోడీ ప్రభుత్వం దాన్ని రద్దు చేసే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. నిత్యం ప్రజల్లో ఉండే సిపిఎం అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి, మండల కార్యదర్శి గంగాదేవి సైదులు, ఎంపీటీసీ తడక పారిజాత మోహన్, గ్రామ కార్యదర్శి వెలమల్ల సంజీవ, నాయకులు బుట్టి కృష్ణ, బాలరాజు, జంగిలి కృష్ణ, కంచర్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

## గెలుపు కోసం కార్యకర్తలు కష్టపడాలి

**ప్రజాపక్షం/ఆలేరు :** భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి గెలుపు కోసం ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్త 15 రోజులు సైనికుడులాగా పనిచేసి గెలుపు కొరకు కృషి చేయాలని టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి జనగాం ఉపేందర్ రెడ్డి అన్నారు. సోమవారం ఆలేరు మండలం కొల్లూరు గ్రామంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అవుతున్నప్పటికీ ఐదు హామీలను నెరవేర్చిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికి ఉందన్నారు. వారికి కాంగ్రెస్ పార్టీ తరపున ధన్యవాదాలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు ఓట్లు వేసి గెలిపిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు శ్రీపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ పిల్లలమర్రి శంకరయ్య, కిసాన్ సెల్ జిల్లా కార్యదర్శి గాజుల దశరథ, పార్టీ నాయకులు అంబాల చంద్రయ్య, బొంతపల్లి మధు, కోటగిరి చందు తదితరులు పాల్గొన్నారు.

## మాజి ఎంఎల్ఏను సన్మానించిన సిద్ధులు



**ప్రజాపక్షం/ఆలేరు :** నాగపురి రాజలింగం మాజీ ఎమ్మెల్యే మాజీ ఎమ్మెల్సీని ఆలేరు మండలం కొలనుపాక గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డం సిద్ధులు వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసి శాలువతో ఘనంగా సన్మానించారు. వారి వెంబడి మాజీ వార్డు సభ్యులు గుర్రాల బాలరాజు, తోడేటి నరేందర్, మాటూరు నర్సింహు తదితరులు పాల్గొన్నారు.

## వధువరులను ఆశీర్వదించిన ఎంపిపి



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి :** కొండమల్లేపల్లి పట్టణంలోని కేఎంఆర్ గార్డెన్‌లో పాశం మల్లారెడ్డి సుకన్యల కుమారుడు శ్రీకాంత్‌రెడ్డి లక్ష్మీ భవానిల, పాత్లావత్ తండాలో రాంకోటి దేవిల కుమారుడు మోహన్ శైలజల వివాహాలలో సోమవారం ఎంపిపి దూదిపాల రేఖశ్రీధర్ రెడ్డి పాల్గొని నూతన వధువరులకు అక్షింతలు చల్లి, నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో జీవించాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కొండమల్లేపల్లి మాజీ ఉప సర్పంచ్ గంధం సురేష్, తోటపల్లి కిరణ్, మోత్యానాయక్, రమేష్ నాయక్, అంజి తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కళాకారుల పనితీరు అమోఘం

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** పోచంపల్లి చేనేత కళాకారుల పనితీరు అమోఘమని ఎన్ఐఆర్డి విద్యార్థులు ప్రశంసించారు. పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లమా ఇన్ రూరల్ డెవలప్మెంట్ మేనేజ్మెంట్ కోర్స్ చేస్తున్న 35 మంది ప్రథమ ద్వితీయ సంవత్సరం విద్యార్థుల బృందం రూరల్ మార్కెట్స్ అండ్ మార్కెటింగ్స్ లో భాగంగా సోమవారం చేనేత కార్మికుల స్థితిగతులు చేనేత పరిశ్రమ ద్వారా ఉత్పత్తి అవుతున్న చేనేత వస్త్రాల తయారీ విధానాలను తెలుసుకోవడానికి క్షేత్రస్థాయి పరిశీలనకు అధ్యయనం నిమిత్తం పోచంపల్లిని సందర్శించారు. ఈ సందర్భంగా పట్టణంలోని టై అండ్ డై హ్యాండ్లూం కోఆపరేటివ్ సొసైటీని సందర్శించి పలు చేనేత వస్త్రాలను తిలకించారు.చేనేత కార్మికులు నేస్తున్న మగ్గాల యూనిట్ల వద్దకు వెళ్లి స్పిన్నింగ్,రోలింగ్ డైయింగ్ డిజైనింగ్ దారం ఎక్స్ట్రాక్టింగ్ వంటి యూనిట్లను పరిశీలించి తెలుసుకున్నారు. పట్టణంలోని మార్కెట్ల ద్వారా మార్కెటింగ్ సదుపాయాలు లాభాలు ప్రమోటింగ్స్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఫ్యాకల్టీ అసోసియేట్ డైరెక్టర్ హైమావతి, అసోసియేట్ ప్రొఫెసర్ దేవప్రియ, ప్రాజెక్ట్ అసిస్టెంట్ మాధవ లు విద్యార్థుల వెంట ఉన్నారు.ఆంజనేయులు,కొంగరి పండరి నాథ్ సొసైటీ సిబ్బంది వారికి చేనేత వస్త్రాలను చూపించి గైడ్ చేశారు.

## ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడి నియామకం



**ప్రజాపక్షం/-భూదాన్ పోచంపల్లి :** ఎరుకల సంఘం యాదాద్రి జిల్లా అధ్యక్షుడిగా పిల్లాయి పల్లి గ్రామానికి చెందిన కూతాడి మల్లేష్ ను నియమిస్తూ తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి కుమార్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి బదనాపురం రఘు, రాష్ట్ర ఉపాధ్యక్షులు శీలమర్తి శేఖర్ రాష్ట్ర కమిటీ సభ్యులు సమక్షంలో సోమవారం నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఎన్నికైన అధ్యక్షుడు మాట్లాడుతూ గ్రామంలోని ఎరుకల నాంచారమ్మ అమ్మవారి గుడి నిర్మాణంలో తన వంతు సేవా కార్యక్రమాలు చేస్తూ అన్ని సంఘాలకు ఆదర్శంగా నిజాయితీగా సేవా భావనతో చేసిన సేవలను గుర్తించి తనను ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.జాతిపట్ల తన వంతుగా ఎల్లవేళలా ఎరుకల ప్రజల, ఎరుకల నాంచారమ్మ చరిత్రను గుడి అభివృద్ధి చేయడానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.వచ్చే మే నెలలో వైశాఖ శుద్ధ పౌర్ణమి నాడు మహా జాతరకు కాంగ్రెస్ పార్టీ శాసన సభ్యులు అనిల్ కుమార్, స్థానిక కాంగ్రెస్ నాయకులు, రాష్ట్ర అధ్యక్షులు కుతాడి కుమార్ ఆధ్వర్యంలో నూతన ఉత్సవ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

## కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపుకై ప్రచారం

**ప్రజాపక్షం/ రామన్నపేట :** పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపు కోసం పట్టణంలోని పలు వార్డుల్లో కాంగ్రెస్ కార్యకర్తలు ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేయడం జరుగుతుందని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మొహమ్మద్ జమీరొద్దిన్, సీపీఐ మండల కార్యదర్శి ఉట్కూరి నరసింహ, ఎంపీటీసీ ఎండి.రేహాన్. మాజీ సర్పంచ్ గోదాసు శిరీషపృద్వీరాజ్, నాసర్, సాల్వేరు లింగం, అక్రమ్, ఆముద లక్ష్మ ణ్, మహబూబ్‌అలీ, బషీర్‌బేగ్, కోట సుధాకర్, బొడ్డు శంకరయ్య, గురుకు శివ, లెంకల ప్రవీణ్, మేడి శంకరయ్య, ఇనాయత్‌తుల్లా బేగ్, అజార్, బైరబోయిన శోభా, గోదాసు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు బిఆర్ఎస్ పాలనను కోరుకుంటున్నారు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** తెలంగాణ రాష్ట్రం ప్రజలు బిఆర్ఎస్ పాలను తిరిగి కోరుకుంటున్నారని మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ, వైస్ చైర్మన్ పుట్ట కిషోర్‌లు అన్నారు. సోమవారం సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి ఆదేశాలతో నల్గొండ పార్లమెంట్ బిఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని కోరుతూ పట్టణంలోని 9వ వార్డులో గడప గడపకు ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఆకుల లవకుశ, బత్తుల జాని యాదవ్, వల్దాస్ జాని, గుండగాని నాగభూషణం, మద్దూరి కుమార్, నీలాల లక్ష్మయ్య, బొడ్డు దుర్గయ్య, పందిరి సైదులు, దొంతుల ఉపేందర్, ఎస్కె అన్వర్, సులోదర్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి చేస్తా ఆశీర్వదించండి

**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** భువనగిరి పార్లమెంట్ పరిధిలోని అన్ని గ్రామాలను మండలాలను అభివృద్ధి చేస్తానని బిజెపి భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం పార్లమెంట్ ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో 400 ఎంపి సీట్లకు పైగా బిజెపికి వస్తున్నాయని మరోసారి ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ ప్రమాణస్వీకారం చేయబోతున్నారని ఆయన అన్నారు. పార్టీలకతీతంగా ప్రజలు బిజెపి పార్టీకి ఓట్లు వేయబోతున్నారని ఆయన అన్నారు. భువనగిరి పార్లమెంటు ప్రజలు ఒక్కసారి ఎంపిగా అవకాశం ఇస్తే ప్రజలకు అందుబాటులో ఉండి అన్ని విధాలుగా భువనగిరి ప్రాంతాన్ని అభివృద్ధి చేశానని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు పడాల శ్రీనివాస్, ఎంపిటిసి రాజేందర్ రెడ్డి, మండల అధ్యక్షులు చిమ్ముల రవీందర్ రెడ్డి, వినోద్ నాయక్, ఈశ్వర్ గౌడ్, ప్రధాన కార్యదర్శులు భీమ్ రాజు, మహేష్, వెంకష్ గౌడ్, గుండ్ల గోపాల్, రవిశంకర్, గణేష్, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పుట్టినరోజు సందర్భంగా వృద్ధాశ్రమంలో అన్నదానం



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** మండలంలోని నాగాయపల్లి ఎంపిటిసి కోమటిరెడ్డి సంతోష భాస్కర్ రెడ్డిల పెద్ద కుమార్తె మోక్ష రెడ్డి పుట్టినరోజు సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా రాయగిరివద్ద ఉన్న సహృదయ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి పండ్లు పంపిణీ చేశారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ప్రతియేడు జరుపుకునే పుట్టినరోజుకు ఈ సంవత్సరం వృద్ధాశ్రమంలో తమ కుటుంబ సభ్యులతో జరుకున్న పుట్టినరోజు తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని మోక్ష,ఆమె తల్లి దండ్రులు సంతోష భాస్కర్ రెడ్డిలు తెలిపారు.
ప్రతి పుట్టినరోజు వేడుకను నలుగురికి ఉపయోగపడే విధంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

## అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

**ప్రజాపక్షం/చివ్వెంల :** నల్లగొండ బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టిఆర్ఎస్ మండల అధ్యక్షులు జూలకంటి జీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని చందుపట్ల గ్రామంలో బిఆర్ఎస్ నాయకులు గడప గడప ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ అధినేత కెసిఆర్ బలపర్చిన నల్లగొండ ఎంపి అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. రాబోయే కాలంలో మళ్లీ బిఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి భూక్య సంజీవ్‌నాయక్, మారినేని సుధీర్‌రావు, గోవిందరెడ్డి, హనుమంతరావు, భూక్య నాగునాయక్, అనిల్ నాయక్, రావిశెట్టి సత్యం, వీరస్వామి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## మాలధారులకు అన్నదానం మహాదానం

**ప్రజాపక్షం/కోదాడ :** మాలధారులకు అన్నదానం చేయడం మహాదానమని మున్సిపల్ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు అన్నారు. సోమవారం పట్టణ పరిధిలోని శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆలయంలో మాలధారులకు నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాగా మాలధారులకు రంజిత్, సీతారామ్మ,సూర్యప్రకాష్,శోభారాణి, జనార్ధనచారినవ్య దంపతులు మహా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కృష్ణ, మల్లెల అనంతచారివెంకటకృష్ణ, పుల్లయ్య,సతీష్,మాలధారణ స్వాములు పాల్గొన్నారు.

# మళ్లీ బిజెపి వస్తే రాజ్యాంగాన్నే మారుస్తారు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** కేంద్రంలో బిజెపి మళ్లీ అధికారంలోకి ఎస్‌సి, ఎస్‌టి, బిసిల రిజర్వేషన్లను తొలగించడంతో పాటు రాజ్యాంగాన్ని మార్చివేస్తామని ఆ పార్టీ పెద్దలే చెబుతున్నారని రిజర్వేషన్లతో పాటు రాజ్యాంగాన్ని పరిరక్షించు కోవాలంటే కేంద్రంలో బిజెపిని గద్దె దించి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని మాల ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ జి. చెన్నయ్య పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలో జిల్లా అధ్యక్షులు లకుమాల మధుబాబు అధ్యక్షతన మాల మహానాడు, మాల ప్రజా సంఘాల జేఏసీ జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ చెన్నయ్య మాట్లాడుతూ నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్ రెడ్డిని అత్యంత భారీ మెజారిటీతో గెలిపించాలని, మాలలంతా ఆయనకే మద్దతు పలకాలని కోరారు. గత పదేళ్ల బిజెపి పాలనలో దళిత, గిరిజన మైనార్టీలతో పాటు మహిళలకు రక్షణ లేకుండా పోయిందని వారిపై దాడులు



నిత్యం జరుగుతున్నాయని, ఈ దేశ మెజారిటీ ప్రజలకు రక్షణతో పాటు ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలంటే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి దళితులకు మూడు ప్రత్యేక కార్పొరేషన్లతో పాటు అన్ని కులాల అభివృద్ధికి కార్పొరేషన్లను ఏర్పాటు చేశారని దళిత బహుజనులు మరింత అభివృద్ధిలోకి రావాలంటే కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాల ప్రజా సంఘాల జేఏసీ వర్కింగ్ చైర్మన్ లు బూర్గుల వెంకటేశ్వర్లు, గోపోజి రమేష్, మన్నె శ్రీధర్ రావు, మల్లికంటి శ్రీనివాస్, వినయ్ కుమార్, రాజేష్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన గుత్తా అమిత్



**ప్రజాపక్షం / నల్లగొండ :** ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బిఆర్ఎస్‌కు మరో బిగ్ షాక్ తగిలింది. రాష్ట్రంలో బిఆర్ఎస్ అధికారం కోల్పోయిన అనంతరం బిఆర్ఎస్‌కు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులంతా హస్తం గూటికి చేరేందుకు బాటలు పట్టారు. గత కొంతకాలంగా అమిత్ పార్టీ మారతారనే ప్రచారం జోరందుకున్న విషయం తెలిసిందే. ఎట్టకేలకు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి అమిత్ రెడ్డి, మదర్ డైరీ మాజీ చైర్మన్ గుత్తా జిత్తేందర్ రెడ్డిలకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఏఐసిసి ఇంచార్జి ప్రధాన కార్యదర్శి దీపాదాస్ మున్షీ, రోడ్లు భవనాలు శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఏఐసిసి కార్యదర్శి రోహిత్ చౌదరి, తదితరులున్నారు.

## తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో గోల్డ్‌మెడల్ సాధించిన గమన్‌రెడ్డి



**ప్రజాపక్షం/నేరేడుచర్ల :** పట్టణానికి చెందిన కొణతం గమన్‌రెడ్డి జిటిఏ తైక్వాండో ఆధ్వర్యంలో జరిగిన గ్రేటర్ హైదరాబాద్ ఓపెన్ తైక్వాండో ఛాంపియన్‌షిప్ 2024 అండర్ 25 కిలోల విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించాడు. బ్లాక్ బెల్ట్‌లో ఒక్క అడుగుదూరంలో ఉన్న గమన్‌రెడ్డి ఇప్పటి వరకు జిల్లా,రాష్ట్ర,జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో మొత్తం 6 మెడల్స్ ( గోల్డెన్ 3, సిల్వర్ 3) సాధించాడు. 2024లో నేపాల్, శ్రీలంక, అర్జెంటీనాలో జరగబోతున్న ప్రపంచస్థాయి పోటీలకు సన్నద్ధం అవుతున్నాడు. అల్కాపూర్ టౌన్‌షిప్‌లో స్కాలర్స్ అకాడమిలో 4వ తరగతి చదువుతున్నాడు. కోచ్ సైకం సుబ్బారావు సైట్స్ సంస్థలో శిక్షణ పొందుతున్నాడు. గమన్‌రెడ్డి నేరేడుచర్ల మాజీ సర్పంచ్ కొణతం సత్యనారాయణరెడ్డివి జయలక్ష్మీల మనవడు. గమన్‌రెడ్డి విజయం సాధించ్ల తల్లిదండ్రులు ఉదయ్ కుమార్‌రెడ్డి,శోభన కుటుంబ సభ్యులు, ఇనిస్టిట్యూట్ నిర్వాహకులు, స్కాలర్స్ అకాడమి ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

## నల్లకోటు కష్టాలు తెలుసు

**ప్రజాపక్షం/నల్లగొండ :** నల్లకోటు వెనక ఉన్న కష్టాలు నాకు తెలుసని, ఎంపిగా గెలిపిస్తే న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నల్లగొండ పార్లమెంట్ బిఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నల్లగొండ జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ సమావేశంలో మాజీ ఎంఎల్ఏ కంచర్ల భూపాల్ రెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీగా గెలిస్తే నా తొలి ఎంపీ ల్యాండ్స్ నుంచి నిధులు న్యాయవాదుల అభివృద్ధికే కేటాయిస్తానని అన్నారు. ప్రజలను చైతన్యవంతం చేయడంలో అడ్వకేట్ల పాత్ర చాలా కీలకమైనదనీ, అటువంటివారు నాకు మద్దతుగా నిలవడం చాలా సంతోషదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సిరిగిరి వెంకటరెడ్డి, జనరల్ సెక్రెటరీ గిరి లింగయ్య గౌడ్, సీనియర్ న్యాయవాదులు మునగాల నారాయణ, నేతి రఘుపతి, లోడంగి గోవర్ధన్, కె.జవహర్ లాల్, జి.జవహర్ లాల్, జి.వెంకటేశ్వర్లు, మామిడి బాలయ్య, మామిడి ప్రమీల, తిమ్మ ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల్లో కృష్ణారెడ్డిని గెలిపించాలి

**ప్రజాపక్షం/డిండి :** అసెంబ్లీ ఎన్నికల్లో మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను నమ్మించి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం



ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తుందని, పాలన చేతగాని దద్దమ్మలు కేసీఆర్‌ను విమర్శిస్తున్నారని కేసీఆర్ వెంట్రుక కూడా పీకలేరని మాజీ మంత్రి, ఎంఎల్ఏ గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. సోమవారం డిండి, చందంపేట, నేరేడుగొమ్ము మండల కేంద్రంలో పార్లమెంట్ ఎన్నికల ప్రచార సభలో జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీలో పది సంవత్సరాలు పంది కొక్కుల్లా మెక్కిన దొంగలే పార్టీని వదిలివెళ్ళారని వెళ్లిన నాయకుల వెంట కార్యకర్తలు ఎవరు వెళ్లలేదని కార్యకర్తల ఉత్సాహం అర్థమౌతుందని అన్నారు. దేవరకొండ నియోజకవర్గంలో పార్టీ బలంగా ఉందని, రవీంద్రకుమార్‌ను ఓడ గొట్టేందుకు కుట్రలు చేసిన వారే వెళ్ళారని పార్టీ కోసం పనిచేసిన నిఖార్సయిన కార్యకర్తలు పార్టీని వదిలిపోలేదని అన్నారు. అధికారం వచ్చాక అసెంబ్లీ పెట్టి కేసీఆర్ బద్నామ్ చేయాలనుకున్న కాంగ్రెస్ కుట్రలను తిప్పి కొట్టిన బిఆర్ఎస్ ఎంఎల్ఏలకు సమాధానం చెప్పలేని స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని, ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగిస్తే రాష్ట్ర పరిస్థితిబాగుండదని తెలిసి కూడా వినకుండా కేంద్రానికి అప్పజెప్పినారని, కేసీఆర్ నల్గొండ సభ అనంతరం కేసీఆర్ దెబ్బకు మళ్లీ మాట మార్చారని అన్నారు. పంటలు ఎండిపోతున్నాయి రైతులు పంట పొలాల్లో గోసతీస్తున్నా దున్నపోతు మీద వాన పడ్డట్టు రేవంత్‌రెడ్డి రైతులను పట్టించుకోవడం లేదని అన్నారు.

## కామ్రేడ్ ముదిరెడ్డి ఆదిరెడ్డి వర్ధంతి



**ప్రజాపక్షం/మునగాల :** ప్రతి సిపిఎం కార్యకర్త కామ్రేడ్ ముదిరెడ్డి ఆదిరెడ్డి ఆశయాలను సాధించాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు మెదరమెట్ల వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అమరవీరుల స్మారక భవనంలో ముదిరెడ్డి ఆదిరెడ్డి 27వ వర్ధంతిని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు చందా చంద్రయ్య, దేవరం వెంకటరెడ్డి, ఎస్‌కె సైదా, జూలకంటి కొండారెడ్డి, వీరబోయిన వెంకన్న, జూలకంటి విజయలక్ష్మి, బచ్చలకూర స్వరాజ్యం తదితరులు పాల్గొన్నారు.

## దంపతులను ఆశీర్వదించిన ఎంఎల్ఎ



**ప్రజాపక్షం/తిరుమలగిరి :** తిరుమల గిరి మండల కేంద్రానికి చెందిన పలువురి వివాహ వార్షికోత్సవ వేడుకలను సోమవారం ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయంలో తుంగతుర్తి ఎంఎల్ఏ మందుల సామేల్కు ఘనంగా జరిపించారు. ఈసందర్భంగా దంపతులకు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపి వారిని ఆశీర్వదించారు. తిరుమలగిరి మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గుండెపూరి గ్రామానికి చెందిన జమ్మిలాల్‌నాయక్, పద్మ, సీనియర్ జర్నలిస్టు, కాంగ్రెస్ పార్టీ మీడియా ఇన్‌చార్జి కందుకూరి లక్ష్మయ్య, మంగ దంపతులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎల్సోజు నరేష్, పేరాల వీరేష్, పాలకుర్తి రాజయ్య, సుంకరి జనార్ధన్, కిష్టునాయక్, రాములునాయక్, రాముగౌడ్, రవి, సతీష్, గణేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## పారామిలటరీ బలగాల కవాతు



**ప్రజాపక్షం/తిరుమలగిరి :** వచ్చే నెల 13న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాల్లో ఎలాంటి అలజడులు జరగకుండా ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని సిఐ రఘువీర్‌రెడ్డి, ఎస్ఐ సత్యనారాయణ లు అన్నారు. సోమవారం మండలంలోని మామిడాల, జలాల్పురం, వెలిశాల గ్రామాల్లో పోలీస్ కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఎవరైన సంఘ విద్రోహ శక్తులుగాని గ్రామాల్లో అలజడులు సృష్టిస్తే వారిపై నిరంతరం నిఘా ఏర్పాటు చేస్తూ చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో పారామిలటరి బలగాలు, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## లాడ్జీల ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/కోదాడ :** పట్టణంలోని పలు లాడ్జీలను పట్టణ ఎస్ఐ రంజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. రాత్రి వేళలో లాడ్జీలో బసచేసే



వ్యక్తుల వివరాలను పరిశీలించి కొత్త వ్యక్తులను పరిశీలించి కొత్త వ్యక్తులను ప్రశ్నిస్తూ వివరాలు ఆరా తీశారు. లాడ్జీలో బసచేసే వ్యక్తుల ఆధార్‌కార్డు, ఇతర వివరాల కోసం సరైన రిజిస్టర్‌ను నిర్వహించాలని లాడ్జీ నిర్వాహకులకు సూచించారు. అనుమానిత వ్యక్తులు, అపరిచిత వ్యక్తులు వచ్చినప్పుడు లాడ్జీలో బసచేసిన సమయంలో తప్పక సమాచారం అందించాలన్నారు. చట్ట విరుద్ధంగా ఎవరికి గదులు ఇవ్వరాదని లాడ్జీ పరిసరాలు స్పష్టంగా కనిపించేలా సిసికెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. లాడ్జిల్లో ఎటువంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్ఐ వెంట ఏఎస్ఐ పులి వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.